క్లుప్తంగా

వైఎస్సార్ సీపీ కార్యకర్త పాడె మోసిన పేర్ని నాని



కోనేరుసెంటర్: బందరు మండలం కోన గ్రామంలో వైఎస్సార్ సీపీ సీనియర్ కార్యకర్త సీతారామయ్య మంగళవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న రాష్ట్ర మాజీ మంత్రి పేర్ని వెంకటరామయ్య (నాని) గ్రామానికి చేరుకుని సీతారామయ్య కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. అంతిమ యాత్రలో పాల్గొని సీతారామయ్య పాడె మోశారు. కుటుంబానికి వైఎస్సార్ సీపీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఎప్పుడు ఎలాంటి సహాయం కావాలన్నా స్వయంగా తనను కలవవచ్చని బాధిత కుటుంబానికి భరోసా ఇచ్చారు. పేర్నితో పాటు పలువురు పార్టీ నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ



కాసానగర్(మోపిదేవి): మండలంలోని పెదప్రోలు శివారు కాసానగర్‌లో ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన దీరావత్తుల లక్ష్మణ నాయక్ (43) కుటుంబ సభ్యులను అవనిగడ్డ మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు మంగళవారం పరామర్శించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబానికి కొంత ఆర్థిక సాయం అందజేసి అండగా ఉంటామని ధైర్యం కల్పించారు. మృతునికి భార్య మల్లేశ్వరి, ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. మండల పార్టీ కన్వీనర్ గరికిపాటి వెంకటేశ్వరరావు, పెదప్రోలు గ్రామపార్టీ కన్వీనర్ జన్యావుల రామోహనరావు, చోడాబత్తిన పూర్ణచంద్రరావు, రామావత్తుల పరమేశ్వరి, కత్తుల శ్రీను, మణికంఠ, జగన్, పరామర్శించిన వారిలో ఉన్నారు.

నాలుగో రోజు పైడమ్మ అమ్మవారి జాతర

పెడన: స్థానిక శ్రీపైడమ్మ అమ్మవారి జాతర మంగళవారంతో నాలుగో రోజుకు చేరింది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. స్థానికులు శిడిబండ్లను కట్టి పట్టణంలో ఊరేగిస్తూ నృత్యాలు చేస్తూ ఆలయానికి చేరుకుని మొక్కుబడులు తీర్చుకున్నారు. కొందరు గారెలను దండలుగా చేసి దంపతులు చలువ బట్టలపై నడుస్తూ ఆలయానికి చేరుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఈవో టీవీవీ మోహనరావు, దేవదాయ శాఖ సిబ్బంది, ఉత్సవ కమిటీ సభ్యులు, పోలీసుల పర్యవేక్షణలో సౌకర్యాలు కల్పించారు.

పాడిపరిశ్రమ అభివృద్ధికి కృషి చేయండి

బంటుమిల్లి: పాడి పరిశ్రమ అభివృద్ధికి కృషి చేయాలని మిల్క్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు చలసాని ఆంజనేయులు అన్నారు. ఆయన మంగళవారం మల్లపరాజుగూడెం, రామవరపుమోడి గ్రామాల్లో పర్యటించి పాడి రైతులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ పాడి ఆదాయం కుటుంబానికి ఎంతో దోహదపడుతుందన్నారు. జిల్లా డైరెక్టరు అర్జా నగేష్‌బాబు, మేనేజరు తోట సత్యన్నారాయణ, సంఘాల అధ్యక్షులు పుప్పాల శ్రీరామమూర్తి, గూడవల్లి శ్రీనివాసరావు, సూపర్‌వైజరు సీహెచ్. వరప్రసాదు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

కిశోర బాలికలపై శ్రద్ధ చూపండి

పెడన: కిశోర బాలికలపై ప్రత్యేక దృష్టి సారించి వారిని ఆరోగ్యవంతులుగా చేసేలా ప్రొత్సహించాలని ఇన్‌చార్జి ఎంపీడీవో ఎం.జయరామ్ అన్నారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో పట్టణంలోని అంగన్‌వాడీ కార్యకర్తలకు, జీఎంఎస్‌కేలకు, ఏఎన్‌ఎంలకు, ఆశా వర్కర్లకు, ఉపాధ్యాయులు, అధ్యాపకులకు కిశోర వికాసం సదస్సు నిర్వహించారు. సీడీపీవో సముద్రవేణి మాట్లాడుతూ బాల్య వివాహాలను నిలువరించాలన్నారు. ఎక్కడైనా ఇటువంటివి జరుగుతుంటే (జీఎంఎస్‌కేలకు) మహిళా పోలీసులు తక్షణం ఐసీడీఎస్ సిబ్బందికి సమాచారం ఇవ్వాల్సిందిగా సూచించారు. సుభాషిణి, సుబ్రమణ్యం, వెంకటేశ్వరమ్మ, సునీత, చందన, నాగమ్మ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు సర్వసభ్య సమావేశం

బంటుమిల్లి: మండల ప్రజా పరిషత్ (ఎంపీపీ) సర్వసభ్య సమావేశం బుధవారం ఉదయం 10 గంటలకు జరుగుతుందని ఇన్‌చార్జి ఎంపీడీఓ నీరజాక్షి తెలిపారు. ఎంపీపీ వెలివెల చినబాబు అధ్యక్షతన జరిగే సమావేశానికి అందరూ సకాలంలో పాల్గొనాలని కోరారు.

నేడు కౌన్సిల్ సమావేశం

పెడన: పురపాలక సంఘ కౌన్సిల్ అత్యవసర సమావేశాన్ని బుధవారం ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ కటకం నాగకుమారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలో జరిగే ఈ సమావేశానికి సభ్యులు, కోఆప్షన్ సభ్యులు, అధికారులు హాజరుకావాల్సిందిగా కోరారు. ఇటీవల మృతి చెందిన కౌన్సిలర్ అనుముల నాగమల్లేశ్వరమ్మకు నివాళులర్పించాల్సి ఉంటుందన్నారు. సభ్యులు, అధికారులు హాజరుకావాలన్నారు.

వణికిస్తున్న చలి పులి

- జిల్లా వ్యాప్తంగా పెరుగుతున్న చలిగాలులు
- రోజురోజుకూ పడిపోతున్న ఉష్ణోగ్రతలు
- తీవ్ర ఇబ్బందులు పడుతున్న చిన్నారులు, వృద్ధులు
- స్వెట్టర్లు, రగ్గులకు పెరుగుతున్న డిమాండ్



జిల్లా పరిషత్ సెంటర్‌లో విక్రయిస్తున్న స్వెట్టర్లు

కోనేరుసెంటర్: జిల్లా వ్యాప్తంగా చలిగాలులు మొదలయ్యాయి. చలిపులికి జనం వణుకుతున్నారు. నిన్న మొన్నటి వరకు ఉష్ణోగ్రతలతో ఉక్కపోతకు గురైన జనం వాతావరణంలో ఏర్పడిన మార్పులతో వీస్తున్న చల్లటిగాలులకు గజగజలాడుతున్నారు. చలిగాలుల నుంచి తాత్కాలికంగా ఉపశమనం పొందేందుకు కొందరు జనం చలిమంటలను వేస్తున్నారు. మరి కొందరు స్వెట్టర్‌లు, మంకీ క్యాపులు ధరిస్తున్నారు.

ఉదయం 8 వరకు వణుకే..

ఉష్ణోగ్రతలు రోజురోజుకు తగ్గుముఖం పడుతున్నాయి. పగటి మాట ఎలా ఉన్నా చీకటి పడితే ఉష్ణోగ్రతలు మరింత తగ్గి చల్లటి గాలులు వీస్తున్నాయి. ఈ గాలుల నుంచి వచ్చే చలికి జనం వణికిపోతున్నారు. పిల్లలు, వృద్ధులు, మహిళలు స్వెట్టర్‌లు ధరించి చలి నుంచి రక్షణ పొందుతున్నారు. సాయంత్రం 5 గంటలకు మొదలవుతున్న చలి మరుసటి రోజు ఉదయం 8 గంటలైనా తగ్గముఖం పట్టకపోవటంతో జనం నిద్రలేచేందుకు కూడా బద్ధకిస్తున్నారు. గత వారం రోజులుగా ఉష్ణోగ్రతలు మరింత మారటంతో మరో నెల రోజుల పాటు చలి ఏ స్థాయిలో ఉంటుందోనని జనం ఆందోళన చెందుతున్నారు.

ఊపందుకున్న వ్యాపారాలు

జనాన్ని చలి చుట్టేయటంతో ప్రజలు స్వెట్టర్‌ల కోసం పరుగులు పెడుతున్నారు. పిల్లల దగ్గర నుంచి వృద్ధుల వరకు ఉన్నితో అల్లిన స్వెట్టర్‌లను కొనుగోలు చేసి ధరిస్తున్నారు. శీతాకాలం వచ్చేయటంతో ఈ ఏడాది రాజస్థాన్, మధ్యప్రదేశ్‌ల నుంచి స్వెట్టర్‌ల వ్యాపారులు నగరంలోకి దిగారు. ప్రధాన కూడళ్లల్లోని రోడ్ల వెంబడి తాత్కాలిక షెడ్లు వేసుకుని విక్రయాలు ప్రారంభించారు. ఈ దుకాణాల్లో స్వెట్టర్‌లు, రగ్గులు, రకరకాల మంకీ క్యాప్‌లు అమ్మకానికి ఉండటంతో పేద, మధ్య తరగతి చలికి వణుకుతున్న ప్రజలు వాటిని కొనేందుకు ఆసక్తి చూపుతున్నారు.

భూ సమస్యల పరిష్కారానికే సదస్సులు



కొంగంచర్ల గ్రామంలో అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ అనిల్‌కుమార్

పెడన: మండలంలో మంగళవారం రెవెన్యూ సదస్సులలో ఏడు అర్జీలు వచ్చాయని ఇన్‌చార్జి తహసీల్దారు కె.అనిల్‌కుమార్ తెలిపారు. కొంగంచర్లలో సదస్సులో నాలుగు అర్జీలు, గురువిందగుంట గ్రామ సచివాలయంలో గురువిందగుంట, కవిపురం గ్రామాలకు చెందిన మూడు అర్జీలు ఇచ్చారన్నారు.ఆర్ఐ విజయలక్ష్మి, వీఆర్వోలు పాల్గొన్నారు.

నేడు కొప్పల్లి, కమలాపురంలో....

బుధవారం ఉదయం 9 గంటలకు కొప్పల్లి గ్రామ సచివాలయం వద్ద రెవెన్యూ సదస్సులో కొప్పల్లి, ముచ్చలిగుంట, ముచ్చర్ల గ్రామాల్లో అర్జీలు స్వీకరిస్తామని తహసీల్దారు కె.అనిల్‌కుమార్ తెలిపారు.

గూడూరు: మండలంలోని రామరాజుపాలెం, ఆకుమర్రు గ్రామాల్లో రెవెన్యూ సభల్లో 42 అర్జీలు వచ్చినట్లు డీటీ పామర్తి శ్రీనివాసరావు తెలిపారు. రామరాజుపాలెంలో 38 వినతిపత్రాలు సమర్పించగా, ఆకుమర్రులో నాలుగు అర్జీలు వచ్చాయన్నారు. మాజీ సర్పంచి గోపి నాగబాబు, మండల సర్వేయరు కె.మురళీకృష్ణ, ఆర్ఐ టి.రాధ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

కోడూరు: స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద మంగళవారం రైతు సదస్సులో సమస్యలు పరిష్కారం కోరుతూ 18 అర్జీలను అధికారులు స్వీకరించారు. తహసీల్దార్ శ్రీనునాయక్ అధ్యక్షతన నిర్వహించిన ఈ సదస్సుల్లో పట్టాదార్ పాస్తుపుస్తకాలు ఇవ్వాలని తొమ్మిది, సర్వే కోసం ఆరు, 22 (ఏ) తొలగింపు కొరకు మూడు అర్జీలను అందించారు. వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగుతున్న తరుణంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించడంతో రైతులు ఆసక్తి చూపలేదు.

నాగాయితిప్ప(మోపిదేవి): రెవెన్యూ సదస్సులో భూ సమస్యలు పరిష్కరించుకోవచ్చునని తహసీల్దార్ శ్రీవిద్య అన్నారు. నాగాయితిప్ప పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ గరికిపాటి వెంకటేశ్వరావు అధ్యక్షతన సదస్సు నిర్వహించారు. రైతు గరికిపాటి రామారావు, కంఠంనేని స్వరాజ్యలక్ష్మి తమ భూములకు సబ్‌డివిజన్ చేయాలని, అవనిగడ్డ రాజరాజేశ్వరి ఆలయ భూమి కరకట్ట విస్తరణలో పోయిందని,నష్టపరిహారం చెల్లించాలని కోరారు. సర్వేయర్ రామకృష్ణబాబు, వీఆర్‌ఓ మోపిదేవి వెంకటేశ్వరావు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

కృత్తివెన్ను: మండలంలోని యండపల్లిలో మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. యండపల్లి, గాంధీనగరం గ్రామాలకు చెందిన రైతులు తమ భూములను ఆన్‌లైన్ చేయాలని డీటీ శశికుమార్‌కు అర్జీలు సమర్పించారు. సర్పంచి ప్రభుదాసు, వీఆర్వోలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సుస్థిరాభివృద్ధే లక్ష్యంగా పనిచేయాలి

నాగాయలంక: సుస్థిరాభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. స్థిరమైన అభివృద్ధి లక్ష్యాల స్థానికీకరణ- 2025- 26పై నాగాయలంక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఉద్యోగులకు శిక్షణ కార్యక్రమం స్థానిక ఎంపీడీఓ జె.కె.సీతారామ్ కుమార్ అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో 'సంపూర్ణ పారిశుధ్యం- లక్ష్యం' అనే అంశంపై ఈఓపీఆర్‌డీ కె.అప్పల నరసమ్మ మాట్లాడారు. 'పేదరికంలేని, మెరుగైన జీవనోపాధుల గ్రామం' అనే అంశంపై ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీఓ టీవీఎస్ ముత్యాలు మాట్లాడారు. ఆరోగ్య గ్రామాలు, స్నేహపూర్వక గ్రామాలు, నీటిసమృద్ధి గ్రామాలు, స్వచ్ఛభారత్ మిషన్- గ్రామీణ్ తదితర అంశాలపై ఎంపీహెచ్‌ఓ శివయ్య, ఐసీడీఎస్ సెక్టార్ సూపర్‌వైజర్ ఎం.నిర్మల, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కె.కిశోర్‌బాబు, ఎఫ్‌టీసీ- డీపీఆర్‌ఎల్ సీహెచ్ అజయ్ మాట్లాడారు. మండల స్థాయి అధికారులు, గ్రేడ్-1 నుంచి గ్రేడ్- 5 కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది ఈ శిక్షణలో పాల్గొన్నారు.

డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ల ఎన్నిక



బండ్రెడ్డి చినబాబు

నాగాయలంక: మండలంలోని తలగడదీవి నీటి సంఘం ఎన్నిక నిలిచిపోగా డిస్ట్రిబ్యూటరీ కమిటీలో మిగిలిన 11 సంఘాలకు చెందిన నూతన అధ్యక్షులతో కనీసం స్థానిక మీడియాకు సైతం సమాచారం లేకుండా మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో డీసీ ఎన్నిక నిర్వహించారు. నాగాయలంక డీసీ ఎన్నిక ఏకగ్రీవంగా ముగిసింది. డీసీ నూతన అధ్యక్షుడిగా బండ్రెడ్డి నాగమల్లికార్జునరావు అలియాస్ చినబాబు (టి.కొత్తపాలెం సంఘం), ఉపాధ్యక్షుడిగా కొక్కిలిగడ్డ నరసింహారావు (ఏటిమొగ సంఘం) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అధ్యక్షుడిగా ఎన్నికైన చినబాబు జనసేన పార్టీ అయినప్పటికీ మండలంలో నీటి సంఘాలు, డీసీ ఎన్నికలు మండల టీడీపీ అధ్యక్షుడు మెండు లక్ష్మణరావు (చంటి) మాత్రమే కీలకపాత్ర పోషించడం విశేషం. నాగాయలంక డీసీ పరిధిలో మండలంలో తొమ్మిది, అవనిగడ్డ మండలంలోని వేకనూరు, అశ్వారావుపాలెం, కోడూరు మండలంలోని మందపాకల నీటి సంఘాలు ఉన్నాయి. ఎన్నికల అధికారిగా ఎఫ్‌డీఓ ఆర్.ప్రతిభ వ్యవహరించారు.

గూడూరు డీసీ చైర్మన్‌గా..

గూడూరు: గూడూరు వాటర్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్‌గా పోతన వెంకట లక్ష్మీ నరసింహస్వామి ఎన్నికయ్యారు. మంగళవారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో డీసీ ఎన్నిక ఏకగ్రీవంగా ముగిసింది. గూడూరు డీసీ పరిధిలోని నిడుమోలు, యలకుర్రు, గూడూరు, కోకనారాయణపాలెం, అరిశేపల్లి, పెడన, బుద్ధాలపాలెం, పోతిరెడ్డిపాలెం, నందమూరు, తాళ్లపాలెం సాగునీటి సంఘాలు ఉన్నాయి. మచిలీపట్నం కేసీ డివిజన్ ఈఈ కె.రవికిరణ్ నిర్వహించిన డీసీ ఎన్నికలలో అధ్యక్షుడిగా గూడూరు సాగునీటి సంఘం అధ్యక్షుడు పోతన వెంకట లక్ష్మీనరసింహస్వామి (టీడీపీ) ఎన్నికవ్వగా ఉపాధ్యక్షుడిగా పోతిరెడ్డిపాలెం సాగునీటి సంఘం అధ్యక్షుడు సాయన శివన్నారాయణ (జనసేన)ను ఎన్నుకున్నారు. ఎన్నికల సహాయ అధికారిగా ఎ.నాగబాబు వ్యవహరించగా గూడూరు డీటీలు పామర్తి శ్రీనివాసరావు, కె.జ్ఞాన సాయిలు పర్యవేక్షించారు.

కోడూరు డీసీ చైర్మన్‌గా..

కోడూరు: కోడూరు మండల డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్‌గా రామకృష్ణాపురం నీటి సంఘం అధ్యక్షుడు దేవనబోయిన వెంకటేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో డీసీ చైర్మన్, డీసీ వైస్ చైర్మన్ల ఎన్నిక నిర్వహించారు. డీసీగా వెంకటేశ్వరరావును, డీసీ వైస్ చైర్మన్‌గా మోదుమూడి నీటి సంఘం అధ్యక్షుడు బొచ్చు రఘునాథ్‌ప్రసాద్‌ను మిలిగిన సంఘాల అధ్యక్షులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వీరికి తహసీల్దార్ శ్రీనునాయక్ నియామక పత్రాలను అందించారు.

శ్రీకాకుళం డీసీ చైర్మన్‌గా అయినపూడి..

శ్రీకాకుళం(ఘంటసాల): మండలంలోని శ్రీకాకుళం ఇరిగేషన్ కార్యాలయంలో శ్రీకాకుళం 29 డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఎన్నిక మంగళవారం జరిగింది. శ్రీకాకుళం డీసీ చైర్మన్‌గా అయినపూడి భాను ప్రకాష్, వైస్ చైర్మన్‌గా సుగ్గున రాంబాబులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారి మద్దూరి సూర్యగోపాలకృష్ణమూర్తి ధ్రువీకరణ పత్రాలు అందించారు. అనంతరం నూతనంగా ఎన్నికైన డీసీ చైర్మన్, వైస్ చైర్మన్లను, సాగునీటి సంఘాల చైర్మన్లను పలువురు అభినందించారు.

రూ.10 లక్షలతో సీసీ రోడ్ల పనులు ప్రారంభం



సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్ శ్రీనివాసరావు

ఉత్తరచిరువోలులంక(మోపిదేవి): మండలంలోని ఉత్తరచిరువోలులంక గ్రామంలో రాజ్యసభ మాజీ సభ్యుడు మోపిదేవి వెంకటరమణరావు కేటాయించిన రూ.10 లక్షల ఎంపీ నిధులతో మంగళవారం సీసీ రోడ్ల నిర్మాణ పనులను గ్రామసర్పంచ్ చింతా శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో సుమారు రూ.70 లక్షలతో సీసీ రోడ్లను అభివృద్ధి చేసినట్లు తెలిపారు. మాజీ ఎంపీ మోపిదేవి వెంకటరమణరావు కేటాయించిన నిధులతో 6వ వార్డులో 97 మీటర్లు సీసీరోడ్డు, 2వ వార్డులో 43 మీటర్లు కాగా ఈ రెండు రోడ్లు సీసీ రోడ్డుగా అభివృద్ధి పరుస్తున్నట్లు ఆయన వివరించారు. ఎంపీటీసీ సనకా వెంకట రాజేష్‌బాబు, ఉపసర్పంచ్ బొమ్మసాని లక్ష్మణరావు, పీఏసీఎస్ మాజీ చైర్‌పర్సన్ రెడ్రౌత్తు వెంకటరమణ, నడకుదుటి రాము, విశ్వనాథపల్లి రాము, కోసూరు శివనాగమల్లేశ్వరావు, సచివాలయం అసిస్టెంట్ ఇంజినీర్ గౌతమి, గ్రామస్తులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు తప్పక పాటించాలి

కోనేరుసెంటర్: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని బందరు ట్రాఫిక్ ఎస్సై వెంకటేశ్వరరావు తెలిపారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు బందరు ట్రాఫిక్ పోలీసులు మంగళవారం నగరంలోని కోనేరుసెంటర్, నాయుడుబట్టి సెంటర్లలో వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవటం, మితిమీరిన వేగంతో వాహనాలు నడపటం అత్యంత ప్రమాదకరమన్నారు. వాహనదారులు తప్పనిసరిగా లైసెన్స్‌లు కలిగివుండాలన్నారు. తల్లితండ్రులు మైనర్లకు వాహనాలు ఇచ్చి రోడ్లపైకి పంపితే పిల్లలతో పాటు తల్లితండ్రులు అందుకు బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఆటోడ్రైవర్లు వాహనాలను రూల్స్‌కు వ్యతిరేకంగా నడుపుతూ కనబడితే కేసులు నమోదు చేసి జరిమానాలు విధిస్తామన్నారు. ప్రమాదాలకు కారకులైతే ఆటోలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సిబ్బంది, వాహనదారులు పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలపై నిరంతర పోరాటం



పారిశుధ్య కార్మికులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న బీఎస్‌ఎన్‌ఎల్ రిటైర్డ్ ఉద్యోగులు



అవనిగడ్డలో పెన్షన్ దారులను సత్కరిస్తున్న నాయకులు

పెడన: రిటైర్డ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటం చేయాల్సి ఉంటుందని, ఎప్పుడు సమావేశం నిర్వహించినా రిటైర్డ్ ఉద్యోగులందరూ తప్పనిసరిగా హాజరు కావాలని మండల యూనిట్ అధ్యక్షుడు మట్ట రాధాకృష్ణమూర్తి అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో పడమట వీధిలోని శ్రీసత్యసాయి మందిరంలో పెడన మండల శాఖ పెన్షనర్స్ డే కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సర్వసభ్య సమావేశంలో పలు తీర్మానాలు చేశారు. అనంతరం సీనియర్లను ఘనంగా సత్కరించి సన్మానించారు. ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచ్ మేనేజర్ కె.వీరవసంతరావు, ఎస్‌బీఐ బ్రాంచ్ మేనేజర్ ఎన్. వీరేష్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనేజర్ యోహాన్, సంఘ నాయకులు భాస్కరరావు, సువర్ణరాజు, ఫణిభూషణరావు, దావు రత్తమ్మ, అబ్దుల్ సుభాని, ఎన్.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు దుప్పట్ల పంపిణీ

మచిలీపట్నంటౌన్: నగరంలోని రిటైర్డ్ ఉద్యోగులు పెన్షనర్స్ డేను మంగళవారం ఘనంగా నిర్వహించారు. బీఎస్‌ఎన్‌ఎల్ పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక బుట్టాయిపేటలోని బీఎస్‌ఎన్‌ఎల్ కార్యాలయం వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా నగరంలోని 31వ డివిజన్‌లో పని చేస్తున్న పారిశుధ్య కార్మికులకు ఆ డివిజన్ కార్పొరేటర్, అసోసియేషన్ బ్రాంచ్ అధ్యక్షుడు యండ్రపాటి నాగేశ్వరరావు, సంఘ నాయకులు దుప్పట్లను అందజేశారు. వారు మాట్లాడుతూ ధరమ్ స్వరూప్ నకారా కృషి ఫలితంగానే పెన్షనర్స్‌కు ప్రతి నెలా పెన్షన్ వస్తోందన్నారు. రిటైర్డ్ ఏజీఎం పీఎస్‌ఆర్ విజయ్‌కుమార్, అసోసియేషన్ బ్రాంచ్ కార్యదర్శి పి.రంగబాబు, సభ్యులు ఎండీ చాంద్‌బాషా, వి.ప్రభుదాస్, కే శ్రీనివాసరావు, సీహెచ్ గంగరాజు, ఎన్.బాజీరావు తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఐసీ కార్యాలయంలో..

స్థానిక ఎల్ఐసీ కార్యాలయం వద్ద రిటైర్డ్ ఉద్యోగులు పెన్షనర్స్‌డేను ఘనంగా నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఎల్ఐసీ రిటైర్డ్ ఉద్యోగులకు ఇవ్వాల్సిన పలు సౌకర్యాలను వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఐసీఈయూ నాయకులు కిషోర్ కుమార్, రిటైర్డ్ ఉద్యోగుల సంఘ ఉపాధ్యక్షుడు సీహెచ్ బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ పెన్షనర్స్ డే

అవనిగడ్డ: ఏపీ పెన్షనర్స్ అసోసియేషన్ దివియూనిట్ ఆధ్వర్యంలో మంగళవారం జాతీయ పెన్షనర్స్ డే నిర్వహించారు. స్థానిక యూనిట్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో గ్రామీణ యువజన వికాస సమితి అధ్యక్షుడు మండలి వెంకట్రామ్ (రాజా), ఎల్ఐసీ బ్రాంచి మేనేజర్ ఆకుల హరి ప్రసాద్ పెన్షనర్స్ పితామహులు ఒట్టోవాన్ బస్మార్క్, ధరమ్ స్వరూప్ నకారా, చంద్రచూడ్ చిత్రపటాలకు పూలమాలవేసి నివాళులర్పించారు. పలువురు సీనియర్ పెన్షన్ దారులను ఘనంగా సత్కరించారు. దివియూనిట్ అధ్యక్షుడు ఎం. రామకృష్ణ, కార్యదర్శి అబ్దుల్ అజీజ్, కోశాధికారి రేపల్లె నాగేశ్వరరావు, మాజీ అధ్యక్షుడు కాశీభొట్ల నాగేశ్వరరావు పాల్గొన్నారు.


కర్రసాము పోటీ విజేతలకు అభినందన

అవనిగడ్డ: నెల్లూరులో జరిగిన జాతీయ స్థాయి కర్రసాము పోటీల్లో ఆరు బంగారు పతకాలు సాధించిన శ్రీ విజ్ఞాన విహార్ స్కూల్ విద్యార్థులను మంగళవారం అభినందించారు. ఈ పోటీల్లో మూడు బంగారు, ఒక వెండి పతకం సాధించిన మూడో తరగతి విద్యార్థి కె.రిషాంక్, ఒక బంగారు, ఒక వెండి పతకం పొందిన ఒకటో తరగతి విద్యార్థి కె.ప్రతీక్, రెండు బంగారు, ఒక వెండి పతకం సాధించిన ఒకటో తరగతి విద్యార్థి టి.అభిషిక్త్‌ని హెచ్‌ఎం, వ్యాయామ ఉపాధ్యాయుడు, ఉపాధ్యాయులు అభినందించారు.

జాతీయ స్థాయి పోటీలకు అర్హత..

హర్యానాలో జరిగిన స్క్వా మార్షల్ ఆర్ట్స్‌లో నలుగురు విద్యార్థులు బంగారు పతకాలు సాధించినట్టు ప్రిన్సిపాల్ డి.సురేష్ తెలిపారు. ఈ మేరకు వీరికి స్కూల్‌లో మంగళవారం అభినందన కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ మోటుపల్లి మనోజ్ఞ మాన్వి, తోట శృతి సిల్వర్, బ్రాంజ్ పతకాలు సాధించడంతో పాటు మొత్తం ఆరుగురు విద్యార్థులు జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించారన్నారు. ఎగ్జిక్యూటివ్ జనరల్ మేనేజర్ ముద్దినేని మురళీకృష్ణ, రీజినల్ ఇన్‌చార్జి రాజేష్‌బాబు పాల్గొన్నారు.

మినుము సాగులో సస్యరక్షణ చర్యలు కీలకం



లక్ష్మీపురంలో మినుము పంట పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు డాక్టర్ సుధారాణి, రేవతి

ఘంటసాల: మినుము పంటలో సస్యరక్షణ కీలకమైందని ఘంటసాల కేవీకే సమన్వయకర్త డాక్టర్ డి.సుధారాణి తెలిపారు. ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఘంటసాల కృషి విజ్ఞాన పరిధిలోని ఘంటసాల, చల్లపల్లి మండలాల్లోని మినుము పంటను శాస్త్రవేత్తలు సుధారాణి, డాక్టర్ కె.రేవతి మంగళవారం పరిశీలించారు. డాక్టర్ సుధారాణి మాట్లాడుతూ ప్రస్తుతం మినుము పంటలో పొగాకు లద్దె పురుగు ఉధృతి అధికంగా ఉన్నట్లు గుర్తించామన్నారు. దీని నివారణకు వేప సంబంధిత మందులను పిచికారీ చేసుకోవాలని సూచించారు. తద్వారా తల్లి పురుగు గుడ్లు పెట్టకుండా, పెట్టిన గుడ్లు పొదగకుండా పిల్ల పురుగుల ఉధృతి తగ్గించవచ్చన్నారు. పురుగు ఉధృతి ఎక్కువగా ఉన్నప్పుడు క్లోరాంట్రనిలిప్రోల్ 60 మి.లీ. లేదా ఇమామెక్టిన్ బెంజోయేట్ 80 గ్రాముల మందు ఎకరానికి పిచికారీ చేసుకోవాలని వివరించారు. మినుము పంటను కాండం గజ్జి ఆశించి నష్టపరుస్తుందని దీనికి ట్రైకోడెర్మ వంటి జీవ శిలీంద్రం పొడి మందుతో విత్తన శుద్ధి చేసుకోవాలని లేదా రిడోమిల్ గోల్డ్ 300 గ్రాములు ఎకరానికి నేల తడిచేలా పిచికారి చేసుకోవాలని రైతులకు సూచించారు.

చెరువులో పడి వ్యక్తి మృతి

గూడూరు: ప్రమాదవశాత్తూ చెరువులో పడి వ్యక్తి మృతి చెందిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గూడూరుకు చెందిన తంటిపూడి వెంకటేశ్వరరావు (42) లారీ డ్రైవర్. స్థానిక మద్దాల ఎస్సీ కాలనీలో నివాసం ఉండే వెంకటేశ్వరరావుకు భార్య, ముగ్గురు ఆడపిల్లలు ఉన్నారు. మనస్పర్థల కారణంగా భార్య తన పుట్టినిల్లు అయిన హనుమాన్‌జంక్షన్‌లో ఉంటుంది. దీంతో ఇంట్లో ఒంటరిగానే ఉంటున్న వెంకటేశ్వరరావు ఈనెల 15న రాత్రి సమయంలో బహిర్భూమికి దగ్గరలో తామర చెరువుకు వెళ్లాడు. ప్రమాదవశాత్తూ కాలు జారి పడిపోయి నీట మునిగి ఊపిరి ఆడక ప్రాణాలు విడిచినట్లు పోలీసులు చెబుతున్నారు. మంగళవారం ఉదయం చెరువులో మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్సై కె.ఎన్.వి.సత్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చిరుజల్లులు.. అన్నదాతల అగచాట్లు



పెడన బైపాస్ రోడ్డులోని తోటమూల సమీపంలో కోతలు కోస్తున్న కూలీలు



జానకీరామపురంలో ధాన్యం రాశులపై ట్రాక్టరు లైట్ల వెలుగులో పరదాలు కప్పుతున్న దృశ్యం

వాయుగుండం ప్రభావంతో వర్షాలు పడతాయనే ఆందోళన కొన్ని రోజులుగా రైతులను వెంటాడుతూనే ఉంది. మంగళవారం ఉదయం నుంచి వాతావరణం కొంత బాగున్నా మధ్యాహ్నం నుంచి కారుమబ్బులు కమ్మేసి చిరు జల్లులు అడపాదడపా పడుతూనే ఉన్నాయి. వర్షం పడితే పండిన పంట నేలరాలిపోతుందని రైతులు ఆందోళన చెందారు. పంట సంరక్షణ పనుల్లో నిమగ్నమయ్యారు. ఏది ఏమైనా వాయుగుండాలు రైతులను వదిలిపెట్టడం లేదని రైతులు వాపోతున్నారు.

– పెడన/కోడూరు/బంటుమిల్లి

ఐదు దుకాణాల్లో చోరీకి యత్నం

కోనేరుసెంటర్: మచిలీపట్నంలో దొంగలు హల్చల్ చేశారు. తాళాలు వేసి ఉన్న దుకాణాల్లోకి చొరబడి చోరీకి పాల్పడేందుకు ప్రయత్నించారు. ప్రయత్నం విఫలం కావడంతో వెంట తెచ్చుకున్న పరికరాలను అక్కడే వదిలి వెళ్లిపోయారు. మరిసటి రోజు విషయం తెలుసుకున్న ఆర్ పేట పోలీసులు అక్కడికి చేరుకుని షాపు యజమానుల నుంచి ఫిర్యాదులు అందుకున్నారు. ఆర్ పేట సీఐ ఏసుబాబు తెలిపిన వివరాలు ప్రకారం.. మచిలీపట్నం ప్రధాన పార్కుకు ఆనుకుని ఉన్న ఐదు వ్యాపార దుకాణాల్లో గుర్తుతెలియని దుండగులు సోమవారం రాత్రి చోరీకి ప్రయత్నించారు. షెట్టర్లను పగలగొట్టేందుకు ప్రయత్నం చేశారు. షాపు తలుపులు బలంగా ఉండడంతో దొంగల ప్రయత్నం ఫలించలేదు. దీంతో వెంట తెచ్చుకున్న పరికరాలను అక్కడే వదిలి వెళ్లారు. విషయం తెలుసుకున్న షాపు యజమానులు షాపుల్లో ఉండాల్సిన వస్తువులను వెతికి అన్నీ సక్రమంగా ఉండడంతో ఊపిరిపీల్చుకున్నారు. అయితే వీటిలో ఓ సెల్ఫోన్ షాపు క్యాష్ కౌంటర్‌లో కొంత నగదును అపహరించి వెళ్లిపోయినట్లు సీఐ ఏసుబాబు తెలిపారు. క్లూస్ టీం సిబ్బంది నిందితులకు వేలిముద్రలను సేకరించారు.

విత్తన శుద్ధి చేసుకోవాలి

మెరకనపల్లి(మోపిదేవి): మినుము విత్తనం నాటే ముందు విత్తన శుద్ధి చేసుకోవాలని ఎంఏవో కె.హెబ్సిబారాణి సూచించారు. మండలంలోని మెరకనపల్లి, చిరువోలు తదితర గ్రామాలల్లో మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా చిరువోలులో రైతు గొరిపర్తి నాగేశ్వరావుతో మాట్లాడుతూ విత్తనాలు నాటే ముందు విత్తన శుద్ధి తప్పనిసరిగా చేసుకోవాలని సూచించారు. మండలంలో ఇప్పటివరకు 5,987 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించడం జరిగిందని, ఇంకా 170 మెట్రిక్ టన్నులు ఆన్‌లైన్ చేయాల్సిఉందన్నారు. ఏఈఓలు, పలువురు రైతులు పాల్గొన్నారు.

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుక



శ్రీకాకుళం(ఘంటసాల): మండలంలోని శ్రీకాకుళం పాత సినిమాహాలు వద్ద పాస్టర్ కె.దైవ ప్రకాష్ బాబు ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాస్టర్ జి.వర ప్రసాద్ మాట్లాడుతూ ప్రజల జీవితాల్లో వెలుగులు నింపే క్రిస్మస్‌ను అందరూ ఆనంద సంతోషాలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం హోసన్నా గాస్పెల్ సెంటర్ వీరంకిలాకు దైవజనురాలు కె.ప్రిస్కిల్లా మోజెస్ సంఘ పెద్దలతో కలిసి కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ముందుగా విశ్వాసులు పాడిన ఆత్మీయ గీతాలు, చిన్నారులు ప్రదర్శించిన క్రిస్మస్ నృత్యాలు ఆకట్టుకున్నాయి. హోసన్నా గాస్పెల్ సెంటర్ పాస్టర్లు శ్రీకాకుళం, వీరంకిలాకు, తెలుగురావుపాలెం, వెలివోలు, ఘంటసాల, పరిసర ప్రాంతాల విశ్వాసులు, ప్రజలు పాల్గొన్నారు.